

జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
ఆదివారం | 25 | జనవరి | 2026 ◆ పేజీలు : 5



## మైనారిటీగురుకులంలో అడ్మిషన్లు ప్రారంభించిన ఎమ్మెల్యే రాగమయి

- అడ్మీషన్ పోస్టర్ ఆవిష్కరణ
- పాల్గొన్న విశిష్ట అతిథి అరుణ కుమారి

**సత్తుపల్లి, జనవరి 24 (ప్రజాజ్యోతి):** పట్టణంలోని స్థానిక గుడిపాడు రోడ్లో గల తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనది. అడ్మిషన్లు 2026– 27 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఆన్లైన్ ప్రక్రియ ద్వారా రిజిస్ట్రేషన్ మొదలయినాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతులుహాజరైనారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మరియు క్రిస్టియన్ మైనారిటీ పేద వర్గాల వారిని దృష్టిలో ఉంచుకొని వారి అభ్యున్నతి కొరకు మైనారిటీ గురుకులపాఠశాలలనుఅంకితభావంతోనడిపిస్తుంది అని తెలిపారు. అందుకనిఈసొసైటీలో విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోట్లరూపాయలుఖర్చుచేస్తుందనితెలిపారు.ఈ అవకాశాన్ని మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంతేకాకుండా ఈ సంస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నిరంతరసేవప్ర శంసనీయమైనదని తెలిపారు.దానికితార్కాణం విద్యార్థుల ప్రతిభే అని, దానికి ప్రత్యక్ష ఉదాహరణ మన స్కూల్ మరియు కాలేజీ ప్రిన్సిపాల్ కత్తి వెంకటరామయ్య అని తెలిపి ప్రత్యేకంగా ఆయనను అభినందించారు. అలాగే మన సత్తుపల్లి లో ఉన్న ఈ మైనారిటీ గురుకులంలో ప్రతిపేద మైనారిటీవి ద్యార్థులుఅడ్మిషన్లుతీసుకోవాలన్నారు.అలాగే నేటి రోజుల్లో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు ఆకాశం వైపు చూస్తున్నాయని, అయినా ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలుకల్పిస్తున్నప్పుడు వాటిని సద్వినియో గంచేసుకోవాలని హితవు పలికారు. అలాగే తాను చదివే రోజుల్లో ఇన్ని సౌకర్యాలు లేవన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించారు. ఇంకా ఈ కార్యక్రమానికి హాజరైన విశిష్ట అతిథి ఖమ్మం జిల్లా మైనారిటీ విద్యాసంస్థల

మిగతా 2 లో...







## బాలలు ఓటేశారు.
# విద్యార్థుల్లో ఎన్నికల జోష్

- ఆకట్టుకున్న మాక్ పోలింగ్
- ఉత్సాహంగా పాల్గొన్న గ్లోబల్ రెయిన్ బో , జేవీఆర్ కళాశాల విద్యార్థులు
- ఓటింగ్ పై అవగాహన కోసమే మాక్ పోలింగ్
- పాఠశాల కరస్పాండెంట్ ఎర్షాద్ అహ్మద్

**పాలేరు ఆర్.సి, జనవరి24, ప్రజాజ్యోతి:** పిల్లలకు ఓటు హక్కు ఎప్పుడొచ్చిది అని అనుకుంటున్నారా. ఇవి నమూనా ఎన్నికలు (మాక్ పోలింగ్) విద్యార్థులలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు కూసుమంచి మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్ బో పాఠశాల, జేవీఆర్ కళాశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు.సాధారణ ఎన్నికలకు ఏమాత్రం తీసిపోకుండా ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులంతా ఎన్నికల్లో

మిగతా 2 లో...





## అక్రమంగా తరలుతున్న
# బెల్లం లారీ పట్టివేత

- రూ.11 లక్షల విలువైన బెల్లం, పట్టిక ను స్వాధీనం

2 లో...



## వైరా మున్సిపాలిటీలో
# ఎమ్మెల్యే విస్తృత పర్యటన

2 లో...

## విద్యార్థుల్లో ఎన్నికల జోష్

(మొదటి పేజీ తరువాయి...)

ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఓటింగ్ విధానం, కౌంటింగ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం ప్రక్రియను నిజమైన ఎన్నికల లాగే నిర్వహించారు. సాధారణ ఎన్నికల మాదిరిగా ఓటర్ లిస్ట్ ప్రకటించి, తరగతి ఆయా సెక్షన్లకు సంబంధించిన బ్యాలెట్ పేపర్ ముద్రించడం, పోలింగ్ ఏజెంట్ల ఏర్పాటు, పోలింగ్ అధికారి, అసిస్టెంట్ పోలింగ్ అధికారుల నియామకంతో సాధారణ ఎన్నికలకు ఏ మాత్రం తీసిపోకుండా ఎన్నిక నిర్వహించారు. సాధారణ ఎన్నికల నిర్వహణలో తీసుకునే జాగ్రత్తలు, ఏర్పాట్లు, సిబ్బంది మొత్తం ప్రక్రియ కొనసాగించి ఎలక్షన్ కొనసాగించడంతో సాధారణ ఎన్నికలలో పోలింగ్ పై పూర్తి అవగాహన కలిగినట్లయింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా విద్యార్థులతో నామినేషన్ లు దాఖలు చేయడం, ఉపసంహరణ నిర్వహించారు. ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, పోలింగ్ అధికారులుగా విద్యార్థులు విధులు నిర్వహించారు. రెండు రోజుల పాటు ప్రచారం నిర్వహించారు. ఎన్నికల అధికారులు నామినేషన్లు పరిశీలించారు. పోటీలో నిలిచిన విద్యార్థులకు గుర్తులు కేటాయించి పోలింగ్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులంతా ఓటు వేశారు. ఈ మాక్ పోలింగ్ ద్వారా విద్యార్థులు ఓటరుగా, అభ్యర్థులుగా మారి ప్రచారం నిర్వహించే విధానాన్ని వివరించారు. దీని ద్వారా విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్యంపై అవగాహన కలిగినట్లైంది. విద్యార్థులు బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం చాలా బాగుందని తెలియజేశారు .మధ్యాహ్న కౌటింగ్ నిర్వహించారు. స్కూల్ లీడర్ గా సీహెచ్ యశ్వంత్, గర్ల్స్ రిప్రజెంటీవ్ గా వై హర్షిత శ్రీ అనురాధ గెలుపొందారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాడెంట్ ఎర్షాద్ అహ్మద్ మాట్లాడుతూ ఓటు రాజ్యాంగం కల్పించినటువంటి హక్కు అని భవిష్యత్తులో ఓటును ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని తెలిపారు. ఓటింగ్ ప్రక్రియను విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా మాక్ పోలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో అకాడమిక్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ , ఇన్చార్జెస్ పాపారావు , జాహ్నవి , నాజియా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఆరిఫ్ అలీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వేపకుంట్ల గ్రామంలో అంగన్వాడి కేంద్రం సందర్శించిన గ్రామ సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా



**రఘునాథపాలెం ప్రజా జ్యోతి** రఘునాథపాలెం మండలం పరిధిలోని వేపకుంట్ల గ్రామంలో శనివారం అంగన్వాడి సెంటర్ లో ఈసీసీఈ కార్యక్రమాన్ని అంగన్వాడి టీచర్, గ్రామ సర్పంచ్ గా పొట్లపల్లి రమాదేవి రాజా, పాల్గొని అంగన్వాడి సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా, మాట్లాడుతూ.పిల్లల చదువుతోపాటు వారి ఎదుగుదల గురించి, తదితర వాటి గురించి తల్లులతో చర్చించారు. ప్రతిరోజు పిల్లలను అంగన్వాడి సెంటర్ కు పంపించాలని సూచించారు. అనంతరం చేతి శుభ్రత, పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై అవగాన జాగ్రత్తలు తీసుకోవాలని. అంగన్వాడి కేంద్రంలో విద్యార్థుల సంఖ్య, ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల వయసు గల చిన్నారులకు అందిస్తున్న తోడ్పాటు పోషకాహార పంపిణీ విధానాన్ని ఆమె పరిశీలించారు. పోషకాహారం సరఫరా ఎలా జరుగుతోందనే అంశంపై సర్పంచ్ వివరాలు తెలుసుకొని, నిర్వహణపై తల్లిదండ్రులను అడిగి వారి అభిప్రాయాలను సేకరించారు. విద్యార్థులు మరియు గర్భిణీ స్త్రీలకు బాలామృతం, గుడ్లు పంపిణీ చేయడం జరిగినది. అలాగే తల్లిదండ్రులు ప్రతి నెల అందించే పాలు, గుడ్లు, బాలామృతాన్ని సకాలంలో తీసుకొని పిల్లలను ఆరోగ్యంగా ఉంచే విధంగా ప్రతిరోజూ అంగన్వాడి కేంద్రానికి పంపించాలని సూచించారు. పిల్లలు బాగుండాలా విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని మిమ్మల్నికోరుకుంటూ ఎల్లవేళలా అన్ని విషయాల్లో అందుబాటులోనే ఉంటానని వేపకుంట్ల గ్రామ సర్పంచ్ గా నేను పొట్లపల్లి రమాదేవి రాజా, గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ఎల్లప్పుడూ ముందుంటామని సూచించారు అన్నారు.

# మైనారిటీగురుకులంలో అడ్మిషన్లు ప్రారంభించిన ఎమ్మెల్యే రాగమయి

(మొదటి పేజీ తరువాయి...)

ప్రాంతీయ సమన్వయ అధికారిణి అరుణకుమారి 2026- 27 అడ్మిషన్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్ ఎల్ సి మాట్లాడుతూ దేశంలోనే తలమానికంగా మన గురుకులాలు ఉన్నాయని చరిత్ర తెలుపుతుందని అందుకు ఉదాహరణగా బీహార్ లోని నలంద విశ్వవిద్యాలయం అని, ఎంతో మంది విదేశీయులు అక్కడ చదువుకొని గొప్పవారిగా రాణించారని ఆ స్ఫూర్తితోనే మన రాష్ట్రంలో గురుకులాల వ్యవస్థ ఏర్పాటు చేయబడిందని వాటిని సద్వినియోగ పరుచుకోవాలని ప్రతి ఒక్క పేద ముస్లిం విద్యార్థి చదువుకొని వారి భవిష్యత్తుకు రాచబాట వేసుకోవాలని తెలుపుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు వసతి భోజనం, పుస్తకాలు, బట్టలు మొదలైన సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తుందని తెలిపారు. తమ విద్యార్థులకు ప్రపంచాన్ని పరిచయం చేసే ఇంగ్లీష్ మీడియంలోనే విద్యా బోధన ఉంటుందని తెలిపారు. అలాగే విద్యార్థుల ప్రగతికి అనునిత్యం కృషి చేస్తున్న ప్రిన్సిపాల్ కే.వెంకట్రామయ్యని అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ కె.వెంకటరామయ్య మాట్లాడుతూ ఇంత బిజీ షెడ్యూల్లో కూడా తమ అభ్యర్థనను మన్నించి కార్యక్రమానికి విచ్చేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో దేనిమీదైనా పట్టు సాధించాలంటే అది కేవలం చదువుకోవడం ద్వారా మాత్రమే సాధ్యమవు తుందని తెలిపి, నిరక్షరాస్యుడైన కుచేలుడు ప్రపంచాన్ని చుట్టి రావాలంటే కేవలం చదువుకుంటేనే సాధ్యమవుతుందని తెలిపారు. అందుకని జ్ఞానాన్ని ,తెలివిని మేల్కొల్పేది చదువేననితెలిపారు.అందుకని మహాకవి కాళోజీ అన్నట్లు ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళ కలయిక అని తెలిపారు అన్నారు.అలాగే ఖమ్మం ఆర్ఎల్ సి కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి కె. సీతారాములు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, విఎంసి జి.చెన్నారావు, మైనారిటీ రిలీజియన్ పెద్దలు షేక్ నాయబ్ రసూల్,ఎండి కమల్ పాషా, ఎస్ ఐ ఓ సత్తుపల్లి ముజీబుర్రహ్మాన్, హిందీ పండిట్ కిష్టారం ఎండి రియాజ్,సి సి ఓ లక్కోమ్జీ ఎస్సీఓవై.శేషగిరి ,దొడ్డాకుల గోపాల్ రావు,పువ్వాళ్ళ ఉమా ఇతర ఉపాధ్యాయులు, ఇమాములు, సదర్లు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వైరా మున్సిపాలిటీలో ఎమ్మెల్యే విస్తృత పర్యటన

**ఖమ్మం వైరా: జనవరి 24 ప్రజా జ్యోతి** వైరా పురపాలక పరిధిలోని నాలుగు, ఏడు, ఎనిమిది, తొమ్మిది వార్డులలో శనివారం వైరా ఎమ్మెల్యే మాలోతు రామ్ దాసు నాయక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణతో కలిసి విస్తృతంగా పర్యటించారు. పార్టీ శ్రేణులతో నేరుగా ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయం నుండి పార్టీ జిల్లా అధ్యక్షుడు, నాయకులు కార్యకర్తలతో బయలుదేరి నాలుగో వార్డు ప్రజలను కలుసుకొని సమస్యలు తెలుసుకున్నారు. అక్కడ ఉన్న మసీదు కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన అలపాహారంలో పాల్గొన్నారు. అనంతరం ఏడవ వార్డు పర్యటించారు. ఈ క్రమంలో పనితి శ్రీను కార్యకర్తలతో ప్రత్యేకంగా కార్యకర్తలతో ఎమ్మెల్యేను కలవటం చర్చనీవసరంగా మారింది. అక్కడనుండి ఎనిమిదవ వార్డులో బోడెపుడి కాలనీ బంక్ కాలనీ, ఎస్సీ కాలనీలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత తొమ్మిదవ వార్డులో బస్టాండ్ సెంటర్ మీదుగా రాజశేఖర్ నగర్ చేరుకొని అక్కడ ప్రజలతో ముచ్చటించారు అక్కడి నుండి ఇందిరమ్మ కాలనీలో ప్రజలను కలుసుకున్నారు. అక్కడ పేరుకుపోయిన సమస్యలను ఓపిగ్గా విన్నారు. అన్నిటిని పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనంలో పాల్గొని ముఖ్య కార్యకర్తలు, నాయకులతో మున్సిపల్ ఎన్నికల్లో అవలంబించాల్సిన తీరు గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో మార్క్ పేడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్ర రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శీలం నర్సిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతగాని జయపాల్ , కాంగ్రెస్ వైరా పట్టణ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, నాయకులు కట్ల సంతోష్ ,పనిటి సైదులు, పనితి శ్రీను, రత్నాకర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరులుతున్న బెల్లం లారీ పట్టివేత

- రూ.11 లక్షల విలువైన బెల్లం, పట్టిక ను స్వాధీనం.
- ఒకరు అరెస్ట్...ఒకరు పరారు... ఇరువురు పై కేసు నమోదు.



**నేలకొండపల్లి, జనవరి 24 ప్రజా జ్యోతి:** మహారాష్ట్ర నుంచి ఏపీ కి అక్రమంగా తరలిస్తున్న బెల్లం లారీని నేలకొండపల్లి ఎక్సైజ్ సర్కిల్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు..స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో సీఐ సుంకరి రమేష్ వివరాలను వెల్లడించారు. శుక్రవారం రాత్రి మహారాష్ట్ర నుంచి ఆంధ్రప్రదేశ్ కు సారా తయారీ కి ఉపయోగించే నల్లబెల్లం తరలిస్తుండుగా... కూసుమంచి మండలం లోని నాయకనూడెం వద్ద దాడులు చేసి పట్టుకున్నారు. అదే సమయంలో తనీఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులకు అనుమానం కలగటంతో లారి ని తనీఖీ చేశారు. నల్లబెల్లం గా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర. షిర్డి లాతూరు జిల్లా కు చెందిన షేక్ రసూల్ అనే లారీ 'డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని విచారిస్తుండుగా...కర్ణాటక లోని బీదర్ జిల్లా, బసవకళ్యాన్ కు చెందిన వ్యాపారి సాహెబాన్ పరారైయ్యాడు. ఆయన వద్ద నుంచి 21,420 కిలోల నల్లబెల్లం, 200 కేజీట పటిక, లారీ, మొబైల్ ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.11 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. లారీ విలువ సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. బెల్లం ను రెండు ఆటోలలో బెల్లం ను దిగుమతి చేస్తున్న విషయం ను గుర్తించినట్లు తెలిపారు. ఒకరిని అరెస్ట్ చేయగా...మరోకరు పరారైయ్యారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో నేలకొండపల్లి ఎస్సై టి. లత, ట్రైనీ ఎస్సై పృధ్వీరాజ్, సిబ్బంది శ్రీనివాస్, రామారావు, వెంకటేశ్వర్లు, లాలు, హరిష్, బలరాం, సునీత, లక్ష్మి, సంపూర్ణ, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ కు ఎంపికైన మర్సకట్ల త్రివేణికి సన్మానం

- రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం మధిర అధ్యక్షులు ఆదూరి అబ్రహం



**మధిర ప్రజా జ్యోతి** ఇటీవల టీవీఎం ఉన్నత పాఠశాలలో జరిగిన సోషల్ స్టడీస్ మండల స్థాయి టాలెంట్ టెస్ట్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి, జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ కు ఎంపికైన జడ్పీహెచ్ఎస్ మహదేవపురం పదో తరగతి విద్యార్థిని నర్సకట్ల త్రివేణిని ఈరోజు రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం మధిర మండల అధ్యక్షులు ఆదూరి, మహాదేవపురం గ్రామ వాస్తవ్యులు అబ్రహం ఘనంగా సన్మానించి ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు.. ఫిబ్రవరి రెండో తారీఖున జరిగే జిల్లాస్థాయి పోటీలో కూడా ప్రతిభ చూపాలని తద్వారా రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్ లో కూడా విజయం సాధించి, పాఠశాలకు గ్రామానికి, మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సాగు సమాధానం, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, సుధాకర్, లక్ష్మి కుమారి, కృష్ణవేణి,, వినోద్ రావు, రాములు, ఫిజికల్ డైరెక్టర్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ అంతర్జాతీయ సంస్థ కాన్సెంట్రిక్స్ తో యస్.బి.ఐ.టి. అవగాహనా ఒప్పందం





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** అమెరికాలోని కాలిఫోర్నియా కేంద్రంగా నిర్వహించబడుతున్న ప్రముఖ అంతర్జాతీయ ఐ.టి.,ఐ.టి, అనుబంధ సేవల సంస్థ కాన్సెంట్రిక్స్ క్యాటలిస్ట్ తో తమ కళాశాల అవగాహానా ఒప్పందం కుదుర్చుకున్నట్లు యస్.బి.ఐ.టి. అటానమస్ కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి,విద్యార్థుల సమక్షంలో ఈ అంగీకారానికి వచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్ కు దీటుగా ఖమ్మంకు అంతర్జాతీయ సంస్థలను పిలిపించి తమ విద్యార్థులకు ప్రపంచ ఆధునిక, సాంకేతిక పోకడలపై అవగాహనా కలిగించటం అటానమస్ గా తమ భాధ్యత అని గుర్తు చేసారు.క్యాంపస్ టు కార్పోరేట్" అనే అంశంతో నిర్వహించిన సదస్సులో సంస్థ సీనియర్ హెచ్.ఆర్. మేనేజర్ డి. సందీప్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ ఏఐ వల్ల ఉద్యోగాల కొరత ఏర్పడదని, ఉద్యోగ స్వభావం మాత్రమే మారుతుందని తెలిపారు. కృత్రిమ మేధ మానవ మేధస్సులో ఒక చిన్న సృష్టి మాత్రమేనని, ఏ కృత్రిమ మేధస్సు కూడా మానవ మేధస్సును మించినవి కావని తెలిపారు.మారుతున్న కాలాన్ని బట్టి మనుషులు, ముఖ్యంగా విద్యార్థుల ఆలోచనలు మారాలని అప్పుడే అందివచ్చే అవకాశాలను సద్వినియోగపరచుకుంటారని తెలిపారు.కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా జి. ధాత్రి మాట్లాడుతూ ఫార్చ్యూన్ 500 కంపెనీలైన అమెజాన్,నెట్ఫ్లిక్స్,ఊబర్, ఫ్లిప్ కార్ట్ వంటి సంస్థలే కాకుండా సుమారు 2000 కంపెనీలు క్లయింట్స్ గా కలిగిన కాన్సెంట్రిక్స్ తమ కళాశాలతో ఒప్పందం కుదుర్చుకోవడం హర్షించదగ్గ విషయమని అభిప్రాయపడ్డారు.ఈ అవగాహనా ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఇంటర్న్ షిప్స్, వర్క్ షాప్స్ మరియు ఉద్యోగ అవకాశాలకు అంగీకారం కుదిరిందని కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు.రానున్న రోజులలో మరిన్ని అంతర్జాతీయ సంస్థలతో తమ కళాశాల ఎం.ఓ.యు లు చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా జి. రాజ్ కుమార్ తెలిపారు. విద్యార్థులు తమ నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాన్సెంట్రిక్స్ క్యాటలిస్ట్ సీనియర్ హెచ్.ఆర్.డి.సంతోష్,కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్,గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్. ఇన్నోవేషన్ భాద్యులు డా యమ్. మురళీ మోహన్, వివిధ విభాగాల హెచ్ ఒడిలు, టి.పి.ఒ. యన్. సవిత,కోఆర్డినేటర్ డా జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాండ్ సెట్ కళాకారులకు అండగా మధుబాబు

- అభివృద్ధి చెందండి చేయూతగా ఉంటాను..
- కళాకారులకు పియానో బహూకరించిన మధుబాబు



**సత్తుపల్లి జనవరి24(ప్రజా జ్యోతి)** గంగారం గ్రామ అభివృద్ధి ప్రదాత,మాజీ వైస్ ఎంపీపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దాసరి వెంకటరామిరెడ్డి (చిట్టి నాయన) వారి తనయుడు గంగారం శ్రీమంతుడు దాసరి మధుమోహన్ రెడ్డి (మధుబాబు) గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రకాష్ నగర్ కాలనీ బ్యాండ్ సెట్ కళాకారులు నిరుపేదలు కావడంతో, సరైన అవకాశాలు లేక, జీవనోపాధి కూడా కష్టంగా ఉండటంతో పియానో సెట్ కావాలని వారందరూ కలిసి మధు బాబును కోరగా, ఆయన వారందరినీ పిలిచి దీనివల్ల మీరు అభివృద్ధి చెందుతారు అనుకుంటే కచ్చితంగా నా సహాయం మీకు అందిస్తానని చెప్పి, శుక్రవారం రాత్రి పియానో ను వారికి బహుమానంగా అందజేశారు. దీని ద్వారా మంచిగా అభివృద్ధి చెందాలని,చెడు అలవాట్లు దూరంగా ఉండాలని, కుటుంబానికి చేయూతగా ఉండి,అభివృద్ధి చెందాలని, అండగా నేనుంటానని వారందరికీ హామీ ఇచ్చారు. ఇంత విలువైన బహుమానం అందించటంతో ప్రకాష్ నగర్ కాలనీ వాసులందరూ, కళాకారులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో మధుబాబు యూత్ సభ్యులు,ప్రకాష్ నగర్ కాలనీవాసులు ఉన్నారు.

## త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు

**నేలకొండపల్లి, జనవరి 24 ప్రజా జ్యోతి:** ప్రజల దాహార్తి ని తీర్చేందుకు తాగునీటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆచార్లగూడెం సర్పంచ్ కొలికపొంగు ఉప్పలమ్మ పేర్కొన్నారు. పంచాయతీ లో శనివారం తాగునీటి సరఫరా కు శాశ్వత పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...గ్రామంలో ప్రజలకు మంచినీటి సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని అన్నారు. ప్రతీ ఇంటికి తాగునీటి ని అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అన్ని వీధులలో శుద్ధజలం ను అందించే పనులను శర వేగంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి లో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని సూచించారు. సమస్యలను దశల వారీగా ఒక్కరూ పాల్గొనాలని సూచించారు. సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు పాలకవర్గం చర్యలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## నేటి సంత నిర్వహణ బంధు చేయడమైనది

- గ్రామపంచాయతీ కార్యదర్శి.

**కారేపల్లి, జనవరి 24, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి లో ప్రతి ఆదివారం జరుగు సంత నేడు 25వ తారీకు ఆదివారం జరుగు సంత నిలుపు చేయబడిన దని గ్రామపంచాయతీ కార్యదర్శి నెహ్రు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి గ్రామపంచాయతీ పరిధి లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంనకు సంబంధించిన పశువులు, మేకలు, ఇతర వస్తువుల సంత ప్రతి ఆదివారం నిర్వహించడం జరుగుతుంది. అట్టి సంతకు వచ్చు ఆదాయంలో గ్రామపంచాయతీకి 15% పన్ను రూపంలో చెల్లించవలసి ఉన్నది. కానీ గత 2014వ సంవత్సరం నుండి గ్రామపంచాయతీకి ఎలాంటి రుసుము చెల్లించలేదు. గ్రామపంచాయతీ నూతనంగా ఎన్నుకోబడిన పాలకవర్గానికి తెలియజేయగా అట్టి సంతను ఆదివారం 25/01/2026 నుండి జరిగే సంతలను నిలుపుదల చేయవలసిందిగా గ్రామపంచాయతీ అంశం నెంబర్ 20 ద్వారా నిలుపుదల చేయుటకు తీర్మానించడమైంది. అందువలన అట్టి సంతను నిలుపుదల చేస్తున్నామని తెలియజేస్తున్నామని తెలిపారు.

## మిస్టు కళాశాలలో ప్రాంగణ నియామకాలు



**సత్తుపల్లి జనవరి24(ప్రజా జ్యోతి)** స్థానిక మదర్ తెరిసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నాడు బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న అన్ని విభాగాల విద్యార్థులకు, ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు డిజిట్ ఐటి (మాదాపూర్) హైదరాబాద్ నుండి వచ్చిన అనూష (టెక్నికల్ డిపార్ట్మెంట్), ఉష( హెచ్. ఆర్ డిపార్ట్మెంట్) ద్వారా క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని. హరికృష్ణ తెలియజేశారు. ఈ ప్రాంగణ నియామకాలలో బీటెక్ విద్యార్థులను టెక్నికల్ పరీక్ష, టెక్నికల్ ఇంటర్వ్యూ మరియు హెచ్.ఆర్ రౌండుల ద్వారా పరీక్షించి అత్యంత ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులను ఐటి ఇంటర్న్ షిప్ కు ఎంపిక చేసినారు.అదే విధంగా ఎంబీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థులను టెక్నికల్ పరీక్ష, టెక్నికల్ ఇంటర్వ్యూ ద్వారా పరీక్షించి అత్యంత ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులను రూ..2.40 లక్షల వార్షిక వేతనంతో బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్స్ గా ఎంపిక చేయడం జరిగింది. ఈ ప్రాంగణ నియామకాలను సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్,సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీ చలసాని. సాంబశివరావు, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వి. రామచంద్ర రావు, ప్లేస్మెంట్ సెల్ ఆఫీసర్ టీ. రాఘవ రాజు, వివిధ విభాగాలు అధిపతులు, అధ్యాపకులు మరియు బోధ నేతర సిబ్బంది అభినందించారు.

## ఆర్టీసీ డిపోలో ఘనంగా డ్రైవర్స్ డే వేడుకలు



**సత్తుపల్లి జనవరి24(ప్రజా జ్యోతి)** డ్రైవర్స్ డే సందర్భంగా సత్తుపల్లి డిపోలో డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో డ్రైవర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తతో వ్యవహరిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని అన్నారు. ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయడం వలన ప్రమాదాలు పూర్తిగా నివారించ వచ్చునని ఆయన ఈ సందర్భంగా అన్నారు. సెల్ఫోన్ డ్రైవింగ్ చేయకూడదు అని డ్రైవర్లకు ఈ సందర్భంగా సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం నేరమని తెలిపారు. ఉదయం 5 గంటల నుండి సత్తుపల్లి డిపోలో ప్రతి ఒక్క డ్రైవర్ కు గులాబీ పూలు అందజేసి డ్రైవర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ, ఆదాయానికి కృషి చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర చాలా ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్.సాహితి ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రవన్న కు ఘన నివాళి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో తెలుగుదేశంపార్టీ సీనియర్ నేత పరిటాల రవీంద్ర 21 వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు, హడ్ హక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లా పెనుగొండ నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి క్యాబినెట్ మంత్రిగా పనిచేశారని.తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో ఆంధ్రప్రదేశ్ లో అనేక సంక్షేమ పథకాలు చంద్రబాబు గారితో కలిసి పనిచేసిన ముఖ్యులు లో ఒకరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఉపేందర్, మేకల సత్యవతి, ఎస్వి రమణ,చల్లగుండ్ల రమేష్, కొలికొండ మురళి, కొల్లుపూర్ణ ధామాల శివ,మద్దినేని శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## నీ ఇంటి స్థలం కోసమే నా పోరాటం

- టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి
- ఇండ్ల జాగాల ఉద్యమం లో సంఘాలన్నీ కలిసి రావాలి
- గణతంత్ర వేడుక దినోత్సవ సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జర్నలిస్టుల ఇంటి జాగా సాధించే వరకు తమ ఉద్యమం ఆగదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి స్పష్టం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో టిడబ్ల్యూజెఎఫ్ ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ సన్నాహ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, జర్నలిస్టుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమని అన్నారు. అవసరమైతే ఉద్యమాన్ని జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.జర్నలిస్టుల ఇంటి జాగాల విషయంలో గత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని ఇకపై సహించేది లేదని ఆయన హెచ్చరించారు. జర్నలిస్టుల కుటుంబాలకు భద్రత, గౌరవం కల్పించే వరకు టిడబ్ల్యూజెఎఫ్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి అదనపు సభ్యుల నియామకం చేపట్టారు.అనంతరం ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ మాట్లాడుతూ, జనవరి 26 ఉదయం 7:45 గంటలకు ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీబీజేపే జిల్లా అధ్యక్షులు వందనపు సామ్రాట్ గుప్తా,వీడియో గ్రాఫర్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్, జిల్లా కోశాధికారి అర్వపల్లి నాగేష్, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ,సంయుక్త కార్యదర్శి కుంభం రవికుమార్,టీబీజేపే జిల్లా కోశాధికారి శ్రీధర్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## బిలివర్ ఈస్టర్ చర్చ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ



**పాలేరు ఆర్.సి.జనవరి24 ప్రజా జ్యోతి** మండల కేంద్రంలోని బిలివర్ ఈస్టర్ చర్చ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం వృద్దులకు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పాస్టర్ సంతోష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొండ కృష్ణవేణి , బైబిల్ ప్రొఫెసర్ దీపక్ రావు, పాస్టర్ అభిషేక్ పాల్గొని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ అభిషేక్ మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో పాటు తన సొంత ఖర్చులతో గత 20 ఏళ్లుగా పేదలను ఆదుకొనుట, సీతకాలంలో దుప్పట్లు పంపిణీ చేయడం,భోజనంతో పాటు అనేక సేవా కార్యక్రమాలతో తమకెంతో సంతోషాన్ని తృప్తిని ఇచ్చిందని, భవిష్యత్తులో తమ సంఘం తరపున పేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని పాస్టర్ అభిషేక్ తెలిపారు. సర్పంచ్ కొండా కృష్ణ వేణి మాట్లాడుతూ వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడకుండా తమ వంతు బాధ్యతగా సంఘ సభ్యులు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం 50 మంది వృద్ధులకు,మహిళలకు దుప్పట్లు అందజేశారు.తమకు సహకరించిన గ్రామస్థులకు, సంఘ సభ్యులకు పాస్టర్ అభిషేక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఏలియా, చర్చి సంఘ సభ్యులు, విశ్వాసులు, వృద్ధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

- జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్






**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఈనెల 30వ తేదీన జరగనున్న తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ తో పాటు మరికొంతమంది కాంగ్రెస్ పార్టీ అనుభూతిపరులు పోటీ చేస్తున్నారని అందరికీ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు సహకరించి ఓటు వేయాల్సిందిగా జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కాంగ్రెస్ లీగల్ సెల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ న్యాయవాదులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, సంక్షేమమే ధ్యేయంగా పార్టీ పనిచేస్తుందని , భవిష్యత్తులో సామాజిక న్యాయం పాటిస్తూ నియామక ప్రక్రియలు ఉంటాయని అన్నారు. ఫిబ్రవరి నెలలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో న్యాయవాదుల ముఖాముఖి ఉంటుందన్నారు. జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులతో సమన్వయం చేసుకొని న్యాయవాద సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం బార్ కౌన్సిల్లో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు సంబంధించిన వాల్ పోస్టర్ను ఆయన ఆవిష్కరించారు. పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఓటు వేసే విధానాన్ని న్యాయవాదులకు వివరించారు.సామాజిక న్యాయం పాటిస్తూ పి పి నియామకాలు చేపట్టాలని పలువురు న్యాయవాదులు జిల్లా అధ్యక్షుడు దృష్టికి తీసుకు వెళ్లారు దానికి అతను సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ సూర్యదేవర బాల కృష్ణ,రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ సింగం జనార్ధన్, జాయింట్ కన్వీనర్ ఆవుల అనురాధ, సీనియర్ న్యాయవాది బత్తుల బసవన్నయ్య, ఆర్.ఎల్. ఎన్ శాస్త్రి, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మలీదు నాగేశ్వరరావు, మాజీ లీగల్ సెల్ అధ్యక్షులు నరేంద్ర స్వరూప్, మాజీ సెక్రటరీ బసవయ్య, నాదెండ్ల వెంకటలక్ష్మి, మద్దెల వెంకటేశ్వర్లు,డోన్వన్ వెంకీయ,నూతలపాటి అప్పారావు,పంబ నాగేశ్వరరావు,యాకూబ్ డోన్వన్ దుర్గ,గుడిసెఅనిల్, అద్దంకి మధు , గజ్జి నరసింహ యాదవ్, ఎరుపుల ప్రవీణ్ భారీ సంఖ్యలో జూనియర్ సీనియర్, మహిళా న్యాయవాదు పాల్గొన్నారు.

## రంజాన్ మాసంలో ముస్లిం విద్యార్థులకు ఇఫ్తార్ విందు ఖర్చులు ప్రభుత్వం భరించాలి

- జిల్లా సంక్షేమ అధికారికి వినతి పత్రం సమర్పించిన ఖమ్మం సిటీ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు అబ్బాస్ బేగ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగరంలోని ప్రభుత్వ పాఠశాలలు మరియు వసతి గృహాల్లో చదువుతున్న ముస్లిం మైనార్టీ విద్యార్థులకు ఇఫ్తార్ విందు కోసం అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరించాలని ఖమ్మం సిటీ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు అబ్బాస్ బేగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఖమ్మం జిల్లా సంక్షేమ అధికారి (DWO) ముజాహిద్ ని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా అబ్బాస్ బేగ్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లా కేంద్రంలో సుమారు 2000 మందికి పైగా ముస్లిం మైనార్టీ విద్యార్థులు వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. రంజాన్ నెలలో ఉపవాస దీక్షలు చేపట్టే విద్యార్థులకు సాయంత్రం వేళల్లో పౌష్టికాహారంతో కూడిన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, వారిపై భారం పడకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు.ముఖ్యంగా, ముస్లిం విద్యార్థులు అధికంగా ఉన్న ప్రతి పాఠశాలకు ఇఫ్తార్ ఏర్పాట్ల నిమిత్తం కనీసం 30 వేల రూపాయల చొప్పున నిధులను తక్షణమే మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.గతంలో ఉన్న ఆచారాలను, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రస్తుత ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అబ్బాస్ బేగ్ పలువురు మైనార్టీ నాయకులు మాట్లాడుతూ,చదువుకునే విద్యార్థులకు రంజాన్ మాసంలో ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది. విద్యార్థులకు పండ్లు, పానీయాలు మరియు అవసరమైన ఆహార పదార్థాల కోసం ప్రతి స్కూల్‌కు నిధులు కేటాయిస్తే ప్రశాంతంగా తమ విద్యాభ్యాసాన్ని, ప్రార్థనలను కొనసాగించగలరు" అని వివరించారు.జిల్లా సంక్షేమ అధికారి ముజాహిద్ స్పందిస్తూ, ఈ విన్నపాన్ని సానుకూలంగా పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు మరియు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గత పాలకుల నిర్లక్ష్యమే కాచిరాజు గూడెంలో ఇంటి పన్నుల భారం...

- సీపీఎం మండల నాయకులు పొన్నం వెంకటరమణ..



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** గత పాలకులు చేసిన తప్పుల వలనే కాచిరాజు గూడెం గ్రామంలో ప్రజలపై ఇంటి పన్నుల భారం అధికంగా పడుతుందని సీపీఎం ఖమ్మం రూరల్ మండల నాయకులు పొన్నం వెంకటరమణ అన్నారు.సామాన్యులపై ఇంటి పనుల భారాన్ని తగ్గించాలని కోరుతూ గ్రామపంచాయతీలో తీర్మానం చేసిన కాపీని ఎంపీఓ కొండపల్లి శ్రీదేవికి సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు.ఈ సందర్భంగా పొన్నం వెంకటరమణ మాట్లాడుతూ...గత పాలకులు చేసిన పొరపాట్ల వల్ల గ్రామంలోని ప్రజలు ఇంటి పన్నులు ఇంటి పన్నులు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.మండల పరిషత్ ఆధ్వర్యంలో కొలతలు సేకరించి నిష్పక్షపాతంగా రికార్డులు నమోదు చేసి ఇంటి కొలతల ప్రకారమే ఇంటి పన్నులు వేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాలోత్ హరి,సీపీఎం నాయకులు పొన్నం మురళి,పొన్నం భాస్కరరావు,అద్దంకి తిరుమలయ్య,చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

- నామినేషన్ల స్వీకరణకు 13 కేంద్రాలు...
- ఏదులాపురం మున్సిపాలిటీ కమిషనర్ మున్వర్ అలీ...



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** మరికొద్ది రోజుల్లో జరిగే ఏదులాపురం మున్సిపాలిటీకి సంబంధించిన వార్డు కౌన్సిలర్ల ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టడం జరుగుతుందని మున్సిపాలిటీ కమిషనర్ మున్వర్ అలీ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో ఏర్పాటు చేయబోయే పోలింగ్ కేంద్రాలు, నామినేషన్ల స్వీకరణ సెంటర్లను ఆయన పరిశీలించారు. నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ బూత్ లల్లో మౌలిక వసతులు, ఇతర సామగ్రి తదితర విషయాలపై సంబంధిత మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫొటోతో కూడిన ఓటరు జాబితాను విడుదల చేయడం జరిగిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 32 వార్డులకు గాను 69 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో సగటున 1000 నుండి1400 మంది ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా నామినేషన్ల స్వీకరణకు గాను మున్సిపాలిటీలో 13 కేంద్రాలను గుర్తించడం జరిగిందని, ఒక్కో నామినేషన్ స్వీకరణ కేంద్రంలో రెండు నుంచి నాలుగు వరకు వార్డులకు పోటీ చేయబోయే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, ఆయా అవార్డులకు సంబంధించి ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శ్రీధర్ రెడ్డి, మధు, కిరణ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న భక్తరామదాసు కీర్తనల కచేరీ చిన్నప్పుడు సెలవులలో వచ్చా..

- ఇప్పుడు అతిథిగా వచ్చా సమాజ సేవతో పాటు భక్తి భావం కలిగి ఉండాలి...
- జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్.





**నేలకొండపల్లి, జనవరి 24 ప్రజా జ్యోతి:** భక్తరామదాసు జయంతి ఉత్సవాలలో భాగంగా రెండో రోజు శనివారం నిర్వహించిన భక్తరామదాసు కీర్తనల కచేరీ విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత మందిరంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పూజలు నిర్వహించారు. రెండో రోజు కార్యక్రమాలను ప్రారంభించారు. హైద్రాబాద్, ఖమ్మం, నేలకొండపల్లి కూసుమంచి తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు వివిధ రూపాలలో ప్రదర్శనలు చేశారు. రామదాసు కీర్తనల కచేరీ, సంగీత, నృత్య కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పూజారి సామిత్రి రమేష్. శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ కనమర్లపూడి రమేష్, కనమర్లపూడి శ్రీధర్, రాధాకృష్ణమూర్తి. ఓరుగంటి నారాయణరావు, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, నంచర్ల దేవీప్రసాద్, కడియాల నరేష్, కైలాసపు వెంకటేశ్వర్లు. రాయపూడి రోహిత్, భువనాసి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

### నేలకొండపల్లి వాసులు చాలా అదృష్టవంతులు...

భక్తరామదాసు నడియాడిన నేల పై పుట్టిన మీరంతా చాలా అదృష్టవంతులని ఏపీ లోని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. రామదాసు జయంతి ఉత్సవాలలో పాల్గొన్నారు. మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...భక్తరామదాసు జయంతి ఉత్సవాలలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందన్నారు. చిన్నప్పుడు "ఇక్కడకు సెలవులలో బంధువుల ఇంటికి వచ్చే వాడిని అన్నారు. ఇప్పుడు అతిధిగా రావటం చాలా ఆనందంగా ఉందన్నారు. భక్తరామదాసు జన్మించిన చోట జన్మించిన మీరు అదృష్టవంతులన్నారు. నేలకొండపల్లి ఆధ్యాత్మిక కేంద్రంగా చరిత్ర చెబుతుందన్నారు. రామదాసు కు చిన్న నాటి నుంచి రాముని మీద భక్తి ఉందన్నారు. ప్రభుత్వ సొమ్ము ను ఉపయోగించి భద్రాచలం లో రామాలయం నిర్మించి జైలు జీవితం గడిపారని అన్నారు. రామదాసు ను మనందరం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సమాజానికి సేవ చేయటం తో పాటు భక్తి భావం కూడ కలిగి ఉండాలని అన్నారు. జైల్లో ఉండి కూడ దేవున్ని నిందించలేదన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతీ ఒక్కరూ పాటు పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు..

## రంజాన్ పండగ సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎర్రుపాలెం మండలం ముస్లిం నాయకులు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** శనివారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన రంజాన్ పండుగ సన్నాహక సమావేశం లో ఎర్రుపాలెం మండల మైనార్టీ నాయకులు మండల మైనార్టీ అధ్యక్షులు షేక్ జానీ భాష, ఎర్రుపాలెం టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ ఎర్రుపాలెం టౌన్ మైనార్టీ సెల్ షేక్ జానీ ఇస్మాయిల్ తక్కెళ్ళపాడుగ్రామ మైనార్టీ అధ్యక్షులు హుస్సేన్ మీనవోలు గ్రామ కాంగ్రెస్ నాయకులు సైదులు బాజీ ,తదితరులు పాల్గొన్నారు.

## కోల్ మైన్స్- వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన మడుపల్లి విద్యార్థినీ విద్యార్థులు



**మధిర ప్రజా జ్యోతి** పీ.ఎం.శ్రీ పథకం కింద ఈరోజు మడుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినీ ,విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇండస్ట్రియల్ విజిట్ లో భాగంగా అశ్వరావుపేట లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి వ్యవసాయ రంగానికి సంబంధించిన అనేక అంశాలు ఆసక్తిగా పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు వ్యవసాయ కళాశాలకు చెందిన అధ్యాపక బృందం చక్కగా వివరిస్తూ వివిధ పంటలు వాటికి సంబంధించిన అంశాలను నేల రకాలు వాతావరణ సంబంధ అంశాలు విపులంగా విద్యార్థులకు చక్కగా విశదీకరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్స్ చందన ,సంజన ,సాయి దుర్గ మరియు ఇతర అధ్యాపక సిబ్బంది ఈ కార్యక్రమం ఆశాంతం విద్యార్థిని విద్యార్థులతో కళాశాల ప్రాంగణంలోని వివిధ పంటలకు సంబంధించిన అంశాలన్నింటినీ దగ్గరుండి పర్యవేక్షిస్తూ, వివరించారు. సత్తుపల్లిలోనే శ్రీ జలగం వెంకటరావు కోల్డ్ మాంసం కూడా విద్యార్థులు సందర్శించి కోల్ ఎక్స్ట్రాక్షన్ మరియు మైనింగ్ తదితర అంశాలను పరిశీలిస్తూ చక్కగా అవగాహన చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన యాజమాన్యానికి, వ్యవసాయ పరిశోధన క్షేత్రం అసిస్టెంట్ డైరెక్టర్ గారికి, ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి గారికి, ఖమ్మం జిల్లా పి ఎం సి పాఠశాల కోఆర్డినేటర్ లకు మడుపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ తోట నరసింహారావు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. సీనియర్ ఉపాధ్యాయులు బుసా కోటేశ్వరావు కంచపోగు ఆదాం ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## కేజీబీవీలో ఘనంగా బాలికల దినోత్సవం



**కారేపల్లి, జనవరి 24, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, కళాశాలయం నందు శనివారం బాలికల దినోత్సవం విద్యాలయ స్పెషల్ అధికారి ఝాన్సీ సౌజన్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఓ మాట్లాడుతూ బాలికలు నేడు చదువులో, ఆటలలో, పాటలలో అన్ని రంగాలలో బాలురు కంటే ముందంజలో ఉంటున్నారు. ప్రభుత్వం బాలికలకు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుటకు ప్రోత్సహిస్తుంది, ఈ ప్రోత్సవాన్ని విద్యార్థులు వినియోగించుకొని కష్టపడి చదివి గురువుల, తల్లిదండ్రుల సూచనలు, సలహాలు ప్రకారం ఉన్నత శిఖరాలను చేరి జీవితాలను అత్యున్నతమైన స్థానములో ఉంచుకోవాలని ఆమె అన్నారు. బాలికల దినోత్సవం సందర్భంగా విద్యాలయంలో బాలికలకు చిత్రలేఖనం, నృత్యం, నాటికలు, ఉపన్యాసాల పోటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిపకనపరిచిన విద్యార్థులకు 10వ తరగతిలో ముందంజలో ఉండే విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. విజయలక్ష్మి ,జి. విజయ, కే. కవిత, ఎం. స్వాతి, మమత, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

- డాక్టర్ ప్రశాంత్



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తే నాలుగు గ్రామాలకి మేలు కలిగే లాగా ఉంటుందని చుట్టుపక్కల ఉన్న గ్రామాలలో నీ ప్రజలందరూ బనిగండ్లపాడు ప్రభుత్వ వైద్యశాలకు సరైనటువంటి సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని డాక్టర్ ప్రశాంత్ ఓ ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ చుట్టుపక్కల ఉన్నటువంటి గ్రామాలకి బనిగండ్లపాడు వైద్యశాల చాలా అరుదైనదిగా అందులోనూ పాత ఆసుపత్రి శిథిలావస్థలో ఉండగా నూతన భవనాన్ని నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక వైద్య వైద్యశాల బనిగండ్లపాడు ఈ ఆసుపత్రి నందు కొన్ని పోస్టులు ఖాళీగా ఉండటం పరీక్షలకు కొంతమంది సిబ్బంది లేకపోవడం ప్రజలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడటం కలుగుతుందని వీలైనంత త్వరగా సిబ్బందిని నియమించాలని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

## తాపీ మేస్త్రీలతో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ ప్రతినిధుల సమావేశం





**మధిర, ప్రజాజ్యోతి** మండలంలో పని చేస్తున్న తాపీ మేస్త్రీలతో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ ప్రతినిధులు స్థానిక వాణి ట్రేడర్స్ & దివ్యశ్రీ ట్రేడర్స్ షాపు యజమాని నాళ్ళ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ అత్యంత నాణ్యత ప్రమాణాలతో అల్ట్రాటెక్ సిమెంట్ తయారవుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మొదటి స్థానంలో అల్ట్రాటెక్ సిమెంట్ నిలిచిందని తెలిపారు. పలు పరీక్షల ద్వారా తయారయ్యే ఈ సిమెంట్ పర్యావరణ పరిరక్షణగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డర్లు, గృహ నిర్మాణదారులకు ,తాపీ మేస్త్రీలకు అల్ట్రాటెక్ సిమెంట్ యొక్క నాణ్యత ప్రమాణాలు మరియు అల్ట్రాటెక్ కంపెనీలో కొత్తగా కన్స్ట్రక్షన్స్ సంబంధించిన మెటీరియల్ , వాటి టెక్నికల్ వివరాలు గురించి తెలిపి బలమైన గృహ నిర్మాణాలకు సహకరించాలని వారు ఈ సందర్భంగా కోరారు. సమావేశంలో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ సేల్స్ మేనేజర్ నాగరాజు,టెక్నికల్ మేనేజర్ రఘుపతి రెడ్డి , సేల్స్ ఆఫీసర్ గోవిందరాజు, మొబైల్ లాబ్ ఇంజనీర్ శేషు కుమార్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.